ద్రష్ట

పూజ్య దాజీ 69వ జన్మదిన సందర్భంగా
ఇచ్చిన సందేశం

దాజీ

సెప్టెంబర్ 28, 2024, కాన్హా శాంతి వనం

ద్రష్ట

ప్రియమైన స్నేహితులారా!

మనం సాధారణంగా దర్శనం అంటే, దివ్యతను దర్శించడంగా అర్థం చేసుకుంటాం. ఒక మహా వ్యక్తిత్వాన్ని సంగ్రహంగా వీక్షించినట్లుగా, సాధారణంగా ప్రజలు దీన్ని అపార్థం చేసుకుంటారు. అయినప్పటికీ మీ అంతరంగంలో అలాంటి వ్యక్తిత్వాన్ని కనుగొనడం ద్వారా మాత్రమే, ఆయన్ని మీరు బాహ్యంగా చూడగలరు. మేము షాజహాన్ పూర్ లో పూజ్య బాబూజీని సందర్శించినప్పుడు, వారిని మా స్వీయ దృక్కోణాల నుండి, మా స్వంత ఫిల్టర్ల ద్వారానే గ్రహించగలిగాము. ఎంతోమంది బాబూజీలో కేవలం కూర్చొని, హుక్కా త్రాగుతూ ఉండే ఒక వృద్ధుడిని మాత్రమే చూసి, అక్కడ నుంచి పారిపోయారు. సామాన్యంగా మనం వ్యక్తులను మన హృదయ దర్పణంలో ప్రతిబింబించినట్లే చూస్తాం. మన హృదయదర్పణం పరిశుభ్రంగా ఉంటే ఆ ప్రతిబింబం సరిగ్గా కనపడుతుంది. అయితే మన అద్దం అపరిశుభ్రంగా, వక్రంగా ఉంటే ఆ ప్రతిబింబం మన స్వీయ స్వభావంతో, భావాలతో, కోరికలతో, తప్పులతో, స్వీయ గుర్తింపుతో సమ్మిళితమై ఉంటుంది. అప్పుడు మన సంస్కారాల నుండి ఉత్పన్నమైన పరిమితుల ద్వారా, మన ఫిల్టర్లు, మన అవగాహనా స్థాయిని బట్టి ఆ ప్రతిబింబాన్ని నిర్ణయించి, దాన్ని ఇష్టపడడం లేదా ఇష్టపడకపోవడం చేస్తాం.

గురువుతో మీ అనుబంధపు ప్రారంభంలో, ఆయనను ఎలా అంచనా వేస్తారు? కొంతకాలం పాటు గురువు సూచించిన పద్ధతిని మీరు ఆచరించినప్పుడు, ఆ అభ్యాసం శాంతిని, అంతరంగ పరివర్తనను మీలో తెస్తున్నదేమో చూడండి. అలా అయితేనే ముందుకు సాగి, మీ వ్యక్తిత్వంలో ఎంతో కొంత మార్పు ద్వారా, మీరు మరింత ప్రయోజనాన్ని ఎలా పొందగలరో చూడండి.

ఏ గురువును సందర్శించినప్పటికీ, మన స్థితి, చూసే దృష్టిలోని స్పష్టతల ఆధారంగానే ఆ గురువు సత్యంగానో, అసత్యంగానో లేదా ఆ రెండింటికి మధ్యలో ఏదో ఒకలాగో కనిపిస్తారు. పవిత్రత

గురించిన మన అవగాహన మన పెంపకం, నేపథ్యాలపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి, పూర్తిగా తెల్లని దుస్తులు ధరించిన మనిషిని చూడగానే, “ఈ పెద్దమనిషి చాలా స్వచ్ఛంగా, మతాచార సంపన్నుడిగా” ఉన్నాడని భావించవచ్చు. అయితే పూర్తి దిగంబరంగా ఉన్న ఒక జైన మునిని ఒక వైష్ణవుడు లేదా ఒక ముస్లిం, అదే వైఖరితో ఎంచి చూడగలరా? సంస్కారాల వల్ల ఉత్పన్నమయ్యే పరిమితులను వదిలించుకున్నప్పుడే, మనం సత్య దర్శనం చేయగలం. అలాంటి దర్శనానికై మనం బాహ్యంగా ఉన్న నేత్రాలను ఉపయోగించలేము; పవిత్ర వస్త్రాలు మనల్ని మోసం చేయవచ్చు. అలాగే మన మధ్యలోనే ఒక పవిత్ర వ్యక్తి ఉన్నప్పటికీ మనం ఆయనను గుర్తించ లేకపోవచ్చు. పరిపూర్ణమైన జ్ఞానయోగాన్నో లేదా చక్కటి యోగాసనాలనో ఎవరైనా ప్రదర్శిస్తున్నట్లు ఊహించండి. అటువంటి వారిచే ఆకర్షించబడి, భక్తిలో పరాకాష్టగా భావించబడే మీరాబాయి వంటి పరిపూర్ణ వ్యక్తిని సైతం విస్మరించవచ్చు కూడా! ఒకరు అంత ఉన్నతంగా మరొకరు అంత నిమ్నంగా ఉన్నప్పుడు వారు ఆమెనెలా గుర్తించగలరు?

ఒక సూఫీ మహాత్ముని గురించిన అందమైన కథ ఒకటి ఉంది. ఒక రాజు ఈ సూఫీ నుండి దీక్ష పొందాలని భావించాడు. కానీ ఆ సూఫీ దానిని వాయిదా వేస్తున్నారు (బహుశా సూఫీ ఆ రాజు యొక్క నిజస్థితిని అర్థం చేసుకొని ఉండాలి). ఇలా రోజులు, నెలలు గడిచి పోతుండగా ఈ తిరస్కరణ వల్ల రాజు ఎంతో నిరాశ చెందాడు. చివరకు రాజు ఈ సూఫీ నిజమైనవాడా, నకిలీనా అని పరీక్షింప దలచాడు. సూఫీ చర్యలను గమనించేందుకు రాజు గూఢచారులను నియమించాడు. ఒకనాడు ఆ సూఫీ మహాత్ముడు నదిని దాటుతుండగా రహస్యంగా వేగులు అతన్ని అనుసరించారు. నదికి అవతలి ఒడ్డున సూఫీ ఒక స్త్రీని కలవడం వారు చూశారు. ఆ సూఫీ ఒక తివాచీని పరచి, కూర్చున్న ఆమె ఒడిలో తలపెట్టి పడుకోవడం, ఆ స్త్రీ ఆయన తలను నిమురుతూ తాగేందుకు ఏదో పానీయం ఇవ్వడం గూఢచారులు గమనించారు. ఏదో కనుగొన్నామన్న ఆనందంతో వాళ్లు వెంటనే రాజుకు చెప్పేందుకు పరిగెత్తారు. రాజు ఈ

అవకాశాన్ని అందిపుచ్చుకొని ఆయన్ని పిలిపించి, "నీవు అక్కడ ఏం చేస్తున్నావు? నీవు నిజమైన గురువువా లేక నకిలీవా?" అని కఠినంగా సూఫీని ప్రశ్నించాడు. సూఫీ ప్రశాంతంగా ఇలా సమాధానం ఇచ్చారు, "దయచేసి ఈ విధంగా మాట్లాడొద్దు! లేదంటే మీరు పశ్చాత్తాప పడవలసి ఉంటుంది. నాతో రండి. నేను నిజంగా ఏమి చేస్తున్నానో మీకు చూపుతాను" అని రాజును ఆ నది ఒడ్డుకు తీసుకువెళ్లాడు. అక్కడ ఒక వృద్ధురాలు టీ తయారు చేస్తూ కూర్చొని ఉంది. ఆమె ఆ సూఫీ మహాత్ముని తల్లి.

మన సంస్కారాలు ఆలోచనలను వక్రీకరించి దురవగాహనకు దారితీస్తాయి. మన అవగాహనా స్థాయి లేదా దురవగాహనా స్థాయిని బట్టి మనం మన జీవితాలను అందంగా లేదా దయనీయంగా మార్చుకుంటాం. అయితే సరైన ఆలోచనతో, తద్వారా ఏర్పడే సక్రమమైన అవగాహనతో, మనం సంస్కారాల ప్రభావాన్ని అవి ఏర్పడక ముందే వాటి దారి మళ్ళించవచ్చు. అవగాహన ద్వారా మనం చాలా అరుదుగానే ముద్రలను – ముఖ్యంగా ప్రతికూల ముద్రలను – ఏర్పరచుకుంటాం.

ఏదైనా సమస్య తలెత్తినప్పుడు వెంటనే ప్రతిస్పందించకుండా కాసేపు ఆగండి. ఇది, మీ హృదయాన్ని ప్రభావితం చేసే ముందు, స్పష్టంగా ఆలోచించేందుకు వ్యవధిని ఇస్తుంది. మీకు ఇబ్బందులను సృష్టిస్తున్న ఆ వ్యక్తి పట్ల సానుభూతి చూపడం ద్వారా మీరా సమస్యను వదిలేయగలుగుతారు. అప్పుడు మీలో మీరు స్వేచ్ఛను అనుభూతి చెందుతారు. అలాగే ప్రకృతి గురించిన మీ అవగాహన – జీవితంలో విషయాలెలా సంభవిస్తాయనేది అర్థం చేసుకోవడం – సులువవుతుంది. ఒక సరైన అవగాహన మరింత లోతైన అవగాహనకు దారి తీస్తుంది. తద్విరుద్ధంగా అర్థం చేసుకునే స్వభావంలేని వ్యక్తి నిరంతరం అటువంటి అర్థం చేసుకోలేని ఫ్రీక్వెన్సీలోనే లేదా అపార్థం చేసుకునేందుకు సరికొత్త కోణాలు కనుగొనడంలోనే ఉండిపోతాడు. సరైన అవగాహనకు, జీవితంపట్ల నిజాయితీతో కూడిన దృక్పథం మద్దతునివ్వాలి.

అవగాహనగల వ్యక్తి ఒక నిర్దిష్ట పరిస్థితికి తగినట్లు వ్యవహరిస్తాడు. ప్రతి పరిస్థితి భిన్నమైనదే కనుక ప్రతి ఒక్క ప్రతిస్పందనా ఒకేలా ఉండదు. తొమ్మిదవ నియమంపై తన వ్యాఖ్యానంలో బాబూజీ, 'ప్రకృతి చర్యలు విభిన్న మార్గాలలో వ్యక్తం అవుతాయని, అలాగే విభిన్న పరిస్థితులలో

మన చర్యలు, ప్రతిచర్యలు అలాగే ప్రతిబింబించాలని' వ్రాశారు. గొప్ప అవగాహన ఉన్న వ్యక్తి అన్ని పరిస్థితులలో ఒకేలా వ్యవహరించే మొండివాడిలా ఉండలేడు. అవగాహనగల వ్యక్తి స్థిరమైన నియమాలకు, పిడివాదాలకు అతీతంగా ఉంటాడు. అతను మృదుత్వాన్ని, స్వేచ్ఛను ఆస్వాదిస్తాడు. సరైన అవగాహన, ఎరుక గలిగి పని చేయడానికి, పాటించడానికి, అనుసరించడానికి, అలాంటివేమీ లేకుండా పని చేయడానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంది.

అంతేకాకుండా అవగాహనతోనే ఒత్తిడిని, అపరాధ భావనను వదిలించుకోవడం వీలవుతుంది. అలా సంస్కారాలు ఘనీభవించకుండా తమను తాము రక్షించుకోగలుగుతారు. స్థిరమైన, పిడివాదపు జీవనశైలితో స్వేచ్ఛాసంకల్పం కలసిమెలసి ఎలా ఉండగలదు? స్వేచ్ఛాసంకల్పం లేకుండా ముక్తి అనేది అర్థరహితం. పిడివాద జీవితం (dogmatic life), దివ్య జీవితానికి (godmatic life) వ్యతిరేకం. దివ్య జీవితం అంతరాత్మతో శృతి కలిపి ముందుకు సాగుతుంది. ఒక నిర్దిష్టమైన మతం లేదా సంఘంతో కలిసి ఉన్నప్పుడు ఏర్పడే అహంకారం, గర్వం వంటి వాటినుండి పిడివాదం జనిస్తుంది.

ఒక్కోసారి అర్థం చేసుకోవడం భారంగా ఉంటుంది. బానిసలుగా భారతీయులను, ఆఫ్రికా దేశస్థులను గత శతాబ్దాలలో వారి స్వస్థలాల నుండి వారికి ఎలాంటి సంబంధమూ, అవగాహనా లేని ప్రదేశాలకు తీసుకెళ్లడం గురించి ఆలోచించండి. ఆ సముద్ర ప్రయాణాలలో వారి ఒత్తిడి స్థాయిలకు, వారిని బంధించి తీసుకెళ్తున్న వారి ఒత్తిడి స్థాయిలకు మధ్య తేడాను ఊహించండి. తమ ప్రయాణపు ఉద్దేశం గురించిన అవగాహన వారిలో మరింత ఒత్తిడికి దారితీస్తుంది. ఆ విధంగా అవగాహన యొక్క సకారాత్మక, నకారాత్మక పరిణామాలను మనం అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. యోగిక జీవనశైలి దృష్టితో చూస్తే, హింసాత్మకంగా ఉండడం వ్యర్థమైనదని, అవగాహన మనకు తెలియజేస్తుంది. కరుణ, సానుభూతి గలిగినవారిగా తయారవడం ద్వారా, మనం ఇతరుల దృష్టి కోణాన్ని సులువుగా చూడగలిగి, ఇతరుల పట్ల హింసకు, నేరాలకు పాల్పడము.

అలాగే అవగాహన ఉన్న వ్యక్తి, క్షమించడం ఎంత విలువైనదో గుర్తిస్తాడు. అంతిమంగా చెప్పాలంటే అవగాహనగల వ్యక్తి క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని, నేర్చుకునే జీవితాన్ని గడపడంలోని విలువను చూస్తాడు. అటువంటి వ్యక్తి ఒక పరిపూర్ణ శిష్యుడిగా తయారవుతాడు.

ప్రాణాహుతి సహాయంతో చేసే ధ్యానం సరైన ఆలోచన, సక్రమమైన అవగాహన పెంపొందించుకొనడంలో సహాయం చేస్తుంది. దురదృష్టవశాత్తూ ప్రతికూల ధోరణులు గనుక వ్యక్తి జీవితంలో ఆధిపత్యం వహిస్తే, ఒక దొంగ పరిపూర్ణమైన దొంగగా మారేందుకు సైతం ప్రాణాహుతి సహాయపడుతుంది. అందుకే మాలిన్యాలను, సంక్లిష్టతలను తొలగించుకోవడం ద్వారా స్వచ్ఛంగా, సరళంగా మారవలసిన అవసరాన్ని హార్ట్‌ఫుల్‌నెస్ నొక్కి చెబుతుంది. క్రమశిక్షణతో కూడిన సాధనా ఫలితాన్ని అనుభూతి చెందడం ద్వారా, బలవంతంగానో, నియంత్రణతోనో కాకుండా సంపూర్ణ ఆనందంతో మన అభ్యాసాన్ని తీవ్రతరం చేయవచ్చు (అయితే ప్రారంభంలో కొద్ది మోతాదు నియంత్రణ వల్ల ప్రయోజనం ఉంటుంది).

స్పష్టతతో చూడడంలోని మరొక అంశం, శ్రద్ధ మరియు పరిశీలనతో చూడడం. దీనికి శిక్షణ ఇవ్వవచ్చు. ఇది చిన్న వయసులోనే ప్రారంభమైతే మంచిది. పిల్లలు చాలా చిన్న వయసులో ఉన్నప్పుడు, వారేం చూస్తున్నారో కొన్ని ప్రశ్నల ద్వారా అడగవచ్చు. “ఈ పొలంలో నువ్వేం చూస్తున్నావు? ఈ పువ్వు మీద ఏం చూశావు? దానికి ఎన్ని రంగులున్నాయి? ఎన్ని రెక్కలు ఉన్నాయి? పువ్వుల్లో ఇంకా ఏమేం లక్షణాలు చూశావు?” అలా లోతైన పరిశీలనలో వారికి శిక్షణ ఇవ్వండి. “ఈ రోజు సూర్యుడు ఏ సమయానికి ఉదయించాడు? రేపు కూడా ఇదే సమయానికి ఉదయిస్తాడేమో గమనించు. ఎటువైపు ఉదయించాడు? ఎటు వైపు అస్తమిస్తున్నాడు? చంద్రుడు ఎప్పుడు పైకి వస్తున్నాడు? ఏ సమయంలో పెద్దగా అవుతున్నాడు? అలాగే ఏ సమయంలో చిన్నగా మారుతున్నాడు?” వారిని కొన్ని పరిశీలనలు చేయనివ్వండి. వాళ్ళు ఎవరింటికైనా, వాళ్ళ స్నేహితుల ఇంటికి లేదా స్కూలుకి వెళ్లి వచ్చినప్పుడు, “వారి ఇంటి తలుపు ఏ దిశగా ఉంది? వారి ఇంట్లోకి తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణాలలో నీవు ఏ దిక్కులో ప్రవేశించావు? వారి ఇంట్లో సోఫా ఏ రంగులో ఉంది? సీలింగ్ ఏ రంగులో ఉంది? ఎన్ని కిటికీలు ఉన్నాయి?” ఇలాంటి వాటిని గమనించేలా పిల్లలకు శిక్షణ ఇవ్వవచ్చు.

అలా కనపడే వాటి గురించే గాక, వినపడే వాటి గురించి కూడా మీరు వారిని ప్రశ్నించవచ్చు. “నేటి ఉదయం ఏవైనా పక్షి కూతలను విన్నారా? ఎన్నింటిని మీరు విన్నారు?” అలా పిల్లల శిక్షణ వికసించేలా కొనసాగించండి. అనుభూతి క్షేత్రం లోనికి వారిని ప్రయాణించనివ్వండి. “ఆ పక్షి సంతోషంగా ఉందా? లేక విచారంగా ఉందా? అది మగదా? ఆడదా?” మీకు వీలైనప్పుడల్లా పిల్లవాడిని ఇలా అడగండి. “నీ లోపల నీకెలా అనిపిస్తోంది? సంతోషంగా ఉందా? బాధగా ఉందా? లేక ఏమీ అనిపించట్లేదా? బాధగా ఉన్నప్పుడు నీ హృదయంలో ఎట్లా అనిపిస్తోంది? బరువుగా ఉందా లేక తేలికగా ఉందా?” ఇలాంటి ప్రశ్నలు విషయాలను మరింత లోతుగా, గాఢమైన స్థాయిలలో గ్రహించడానికి వారిని సన్నద్ధం చేస్తాయి.

ధ్యానంలో మరింత అవగాహనతో, అప్రమత్తతతో, సున్నితత్వంతో, గ్రహింపుతో, సూక్ష్మగ్రాహ్యతతో ఉండేందుకు మనకు మనం శిక్షణ ఇచ్చుకుంటాం. ఉదాహరణకు ధ్యాన సాధనలో మనం చూసే రంగు, మన అనుభూతులు, మనం సాక్షిగా గమనించే ఆలోచనలు, మన భావ ప్రకంపనలు, అలాగే ధ్యానానంతరం మనం అనుభూతి చెందే స్థితి... సిట్టింగ్ తర్వాత ఈ పరిశీలనలను మీ ప్రిసెప్టర్ తో పంచుకోండి. తద్వారా వారు ఆ ఖాళీలను పూరించి, “నేను ఈ పనిని ఈ విధంగా చేసినప్పుడు, నాకు ఈ విధమైన ఫీడ్ బ్యాక్ (అభిప్రాయం) అందుతున్నది” అని ఒక విధమైన నిర్ధారణకు వచ్చేందుకు వీలవుతుంది. అప్పుడు మనం చేసే పనికి, దాని ఫలితానికి మధ్య ఒక సంబంధాన్ని స్థాపించవచ్చు. ఇతరుల భావాలను గమనించినట్లే, వాతావరణాన్ని సైతం గ్రహించవచ్చు. ఒక నిర్దిష్ట ప్రదేశంలో మనకి ఎలా అనిపిస్తుంది? మన అంతరంగంలో ఒక ప్రేమ పూరితమైన సూక్ష్మ దృష్టిని కలిగి ఉండేందుకు ఇటువంటి శిక్షణ మనల్ని సిద్ధం చేస్తుంది. దృష్టి సారించేందుకు ప్రేమ ఒక ముఖ్యమైన అంశం. ప్రేమ లేనప్పుడు మనం ఎవరినీ అధ్యయనం చేయలేము.

దాదాపు మనందరం వివిధ లక్ష్యాలతోనే మన గురువర్యులను గ్రహించేందుకు ప్రయత్నిస్తాం. ఇలా చూడడం అనేది ఎప్పుడూ మనం ఉన్న స్థాయి నుంచే ఉంటుంది. ఉదాహరణకు సూర్యాస్తమయం ఉన్నది. సూర్యుడు దిగంతరేఖపై అస్తమించే దృశ్యం కనిపించనందువల్ల, లోయలో ఉండే వ్యక్తులు దాన్ని పూర్తిగా చూసి ఆస్వాదించలేరు. అయితే దీనికి విరుద్ధంగా పర్వత శిఖరంపై ఉన్న వ్యక్తికి ఎంతో సుందరమైన దృశ్యం ఆవిష్కృతమవుతుంది. అతను ఉన్న ఎత్తు, ఆ తేడాను కలుగజేస్తుంది. చక్రాలు అనే మెట్లు కలిగిన చైతన్యపు నిచ్చెనను అధిరోహించినప్పుడు,

మన క్రమానుగత ఎదుగుదల, మన దృష్టికి మరింత స్పష్టతను ఇస్తుంది. అప్పుడు మనం వివిధ స్థాయిలలో దర్శనాన్ని అనుభూతి చెందుతాం.

అలాగే పెరుగుతున్న మన అవగాహన కారణంగా, మనం గురువర్యుల పనిని అభినందించడం ప్రారంభిస్తాం. ఇద్దరూ ఏకమైనప్పుడే, ఆ ఉత్సాహం మరియు గురువర్యుల సంపూర్ణ దర్శనం సాధ్యమవుతుంది. అప్పటివరకూ మనకు లభించే సమాచారం అంతా, మనం పొందే దర్శనం అంతా, నియంత్రించబడి ఉంటుంది. అటువంటి మనసుతో మనం నిజమైన దర్శనాన్ని పొందలేము.

మీరు గురువుతో ఉన్నప్పుడు సంపూర్తిగా ఆయనతోనే ఉండాలి. కానీ దురదృష్టవశాత్తు ఈ రోజులలో మన దృష్టిని ప్రతిదీ మరల్చుతోంది. ఆ విషయంలో ఫోన్ ది మొదటి స్థానం. కోరికలు లేకుండా, పరధ్యాన రహితంగా, సంస్కార రహితంగా మీరు తయారైనప్పుడు మరి ఆయన సాన్నిధ్యం యొక్క ప్రయోజనాన్ని పొందకుండా ఎలా ఉండగలరు? మీరు వారితో ఉన్నప్పుడు మీలో గౌరవం, ప్రేమ, వినయం, నిష్కాపట్యత వంటి లక్షణాలను కలిగి ఉండడం అవసరం. కోరికలను ఆశ్రయించడం, ప్రార్థన ద్వారా వాటిని వెలిబుచ్చడం లేదా వాటిని మీ మదిలోనే ఉంచుకోవడం కూడా మిమ్మల్ని వారి దర్శనం యొక్క అనుభూతి చెందకుండా నిరోధిస్తుంది. అన్ని రకాల అవసరాలను ప్రార్థనలు వ్యక్తపరుస్తాయి. మరి మీరు మీ కోరికలు తీరేందుకు ఇంకెవరి వైపు చూస్తారు? అయితే మీరు, “ఓ ప్రభూ! మీరు నా కోసం ఇది చేస్తే, నేను మీకు కోట్ల కొద్దీ సమర్పిస్తాను, ఇళ్ళు లేనివారికి ఇళ్లు కట్టిస్తాను, మీ విగ్రహానికి ‘చద్దర్’[1] సమర్పిస్తాను...”

[1] పుణ్యక్షేత్రాలలో భక్తిగౌరవాలకు గుర్తుగా సమర్పించే వస్త్రం. భక్తుని ప్రార్థనలను, కోరికలను, ఆ వస్త్రం స్వామివారి వద్దకు చేరుస్తుందని విశ్వసిస్తారు.

ఇలా ఆయనతో బేరమాడటం మంచిది కాదు. భగవంతుడి నుండి ప్రేమను, గౌరవాన్ని లేదా వినమ్రతనివ్వమని కోరుకోవడం మీ అహానికి తృప్తిని ఇస్తుంది. ఎక్కువమంది ఆకలిని తీర్చడం కోసం మరింత సంపదను ఇమ్మని, అలాగే నిరుపేదలకు ఆశ్రయం ఇవ్వడం కోసం మరింత ధనమిమ్మని ఆ భగవంతుని ప్రార్థించడంకన్నా ఇదేమీ వేరు కాదు. ఇలాంటి లంచాల వ్యాపారం నిరాటంకంగా కొనసాగుతోంది. ఒకసారి ఇలా ఆలోచించండి. ఒక వ్యక్తి కనుక భగవంతునికే లంచం ఇచ్చేందుకు సిద్ధపడితే, ఇక ప్రభుత్వ అధికారులతో, రాజకీయ నాయకులతో అతను ఎలా వ్యవహరిస్తాడు? మనమా వ్యక్తిపై జాలి పడగలం, అంతే!

మీరు కోరికల మూటను కలిగి ఉండి వాటిని తీర్చుకోవడానికి గురువర్యుల వద్దకు వెళితే, అప్పుడు మీకు ఆయన నిజమైన దర్శనం కలగదు. దర్శనానికి మొదటగా కావలసినది స్వచ్ఛత. రెండవది మీరు వారి వద్ద సంపూర్ణ ప్రత్యాహారంతో (ఇంద్రియాలను ఉపసంహరించుకొని) నిశ్చలంగా ఉండగలగాలి. అలాగే మీరు వారితో తప్పక అనునాదం చెందగలగాలి. ఉదాహరణకు మీరు ఒక సంగీత కళాకారుల బృందంలో చేరాలనుకుంటే వాళ్లు ఆలపించే సంగీతాన్ని మీరూ ఆలపించాల్సి ఉంటుంది. మీ సొంత బాణీలో పాడి, వారితో ఏకరీతిగా ఉండాలని ఆశించలేరు. సంగీతం జతకట్టాలి. లేకపోతే అది కేవలం శబ్దమే అవుతుంది. అలాగే ఒకవేళ మీకు ఆయన దర్శనం లభించినా అది వృథా!

శ్రీకృష్ణుడు తన విశ్వరూపాన్ని – విధ్వంసకర రూపాన్ని – అర్జునునికి చూపినప్పుడు ఆ విధ్వంసకర కార్యం అప్పటికే పూర్తయినట్లుగా చూపడం జరిగింది. అందులో అర్జునునికి సందేశం ఏమంటే, “పని పూర్తయింది. ఇప్పుడు నువ్వు చివరి దశను మాత్రమే పూర్తి చేయాలి” అని. అయితే శ్రీకృష్ణుని విధ్వంసకర రూపాన్ని దర్శించిన అర్జునుడు భయకంపితుడై, తన స్నేహపూర్వక, సుపరిచిత రూపానికి తిరిగి రావాలని ఆయనను అభ్యర్థించాడు.

ఒక అద్భుత వ్యక్తిత్వం యొక్క సత్యతత్వంతో
అనునాదం చెందేందుకు మీరు మీలో ఉన్న అదే
సత్యతత్వాన్ని స్పృశించగలగాలి.

అదే సమయంలో యుద్ధంలో ప్రతిపక్షంలో ఉన్న భీష్మ, ద్రోణుల వంటి ఉన్నతాత్ములు శ్రీకృష్ణుని ఈ రూపాన్ని చూసి విస్మయం చెందారు. కానీ వాళ్ళు నిజంగా విస్మయం చెందారా? చెంది ఉంటే వాళ్లు తమ ఆయుధాలను వదిలివేసి, "పోరాడవలసిన అవసరం లేదు" అని అనేవారు. ఒకవేళ శ్రీకృష్ణుని విశ్వరూప సందర్శనం అర్జునుడిని ఆయుధం పట్టేలా చేస్తే, అదే విశ్వరూపం భీష్మ, ద్రోణులను వారి వారి ఆయుధాలను త్యజించే విధంగా చేసి ఉండాలి. ఈ దర్శనం, ఎవరికీ, చివరకు అర్జునునికి సైతం విజ్ఞతను దానంతట అదిగా – ఆటోమేటిగ్గా – ఇవ్వలేకపోయింది. పైగా అప్పటికే యుద్ధం చేసేందుకు సిద్ధపడిన అర్జునుడు "నేను ఈ రూపాన్ని చూడలేకున్నాను" అన్నాడు. అందువలన పరమాత్మ నిజరూపాన్ని దర్శించడం అనేది జీవిత సమస్యలను ఆటోమేటిగ్గా పరిష్కరించలేదు. మీరు కొంత సంతృప్తితో, "నాకు పరమాత్మ దర్శనం లభించింది" అనో, "నేను మూర్తి దర్శనం పొందాను" అనో, "నేను కొన్ని దైవిక లక్షణాలు అనుభూతి చెందాను" అనో అంటారు. అయితే సాధించాల్సింది ఎంతో ఉంది. భగవంతుని దర్శనం మీకు కలిగే ఇంకొక అనుభవం మాత్రమే. అది క్షణికమే! ఆ అనుభవంతో మీరేమి చేస్తారు? "నేను దేవుడిని చూశాను" అయితే ఏమిటి? తద్వారా మీరేవిధంగానైనా తయారయ్యారా? ఒక అద్భుత వ్యక్తిత్వం యొక్క సత్యతత్వంతో అనునాదం చెందేందుకు మీరు మీలో ఉన్న అదే సత్యతత్వాన్ని స్పృశించగలగాలి.

ఒక లేఖకు సమాధానమిస్తూ బాబూజీ ఒకసారి ఇలా వ్రాశారు: "మహాపురుషుల దర్శనాన్ని నీవు ఆశించడం మంచిదే! అయితే స్వీయ దర్శనానికై ప్రయత్నించడం మరింత మంచిది." స్వీయ (ఆత్మ) దర్శనానికి సంబంధించి ఇక్కడ ద్రష్ట ఎవరు? దర్శించబడేది ఏమిటి? చూసేవాడికి మనం తరచుగా 'దర్శి' అనే పదాన్ని ఉపయోగిస్తాం. నిత్యజీవితంలో దర్శి సాధారణంగా దేన్నైనా గమనించే, పరిశీలించే ఒక వీక్షకుడు లేదా ప్రేక్షక బృందంలోని సభ్యుడు. బుద్ధి జీవులుగా

మనమందరం వీక్షిస్తాం. కనుక మనమంతా 'దర్శ'లమే! మనం గ్రహిస్తాం, చూస్తాం, వింటాం, అనుభూతి చెందుతాం, అవగతం చేసుకుంటాం. యోగా 'ద్రష్ట' అనే మరింత కచ్చితమైన పదాన్ని వాడుతుంది. ద్రష్ట ప్రత్యేకంగా పురుష లేదా ఆత్మ అనబడే నిజమైన అంతరంగ సాక్షిని సూచిస్తుంది. దర్శి అనే పదం – దేన్నయితే మనం భౌతిక ఇంద్రియాలకు, సూక్ష్మ శరీరాలకు, ఆత్మకు గంపగుత్తగా వాడతామో – అలా కాకుండా ద్రష్ట అనేది కేవలం ఆత్మ యొక్క – కళ్ళు, మనస్సు లేదా ఇతర ఇంద్రియాల వలేగాక – సాక్షీభూత సామర్థ్యాన్ని సూచిస్తుంది.

ఆత్మ స్వచ్ఛమైన కర్తృత్వాన్ని కలిగి ఉండి జ్ఞానం, అనుభవానికి సంబంధించిన అన్ని విషయాలకూ సాక్షీభూతంగా ఉంటుంది.

ఆత్మ స్వచ్ఛమైన కర్తృత్వాన్ని కలిగి ఉండి జ్ఞానం, అనుభవానికి సంబంధించిన అన్ని విషయాలకూ సాక్షీభూతంగా ఉంటుంది. కర్త (సబ్జెక్ట్) గ్రహించేదంతా, అనుభూతి చెందేదంతా, తెలుసుకునేవన్నీ "వస్తువుల" (ఆబ్జెక్ట్స్) - అంటే గ్రహించదగినవి, అనుభూతి చెందదగినవి, తెలుసుకొనదగినవి - వర్గంలోనికి వస్తాయి. స్వచ్ఛమైన కర్తృత్వ స్వభావ కారణంగా ఆత్మ, తన స్వీయ గ్రహింపునకు, అనుభవానికి, జ్ఞానానికి ఒక వస్తువుగా మారదు. అటువంటి పరిస్థితులలో మనకు దాని దర్శనం ఎలా లభిస్తుంది?

ఎలాగైతే సూర్యుని కాంతి వస్తువులపై ప్రతిఫలించి అవి మన కళ్ళకు కనపడేలా చేస్తుందో, అలాగే ఆత్మ చైతన్యం, జ్ఞేయ వస్తువులను ప్రకాశింపజేసి, ద్రష్టకు అవి కనపడే వీలు కల్పిస్తుంది. చైతన్య కాంతి వలన ప్రకాశింపబడే వస్తువులన్నీ "చైతన్య క్షేత్రం"గా పిలవబడతాయి. చైతన్య కాంతి ద్వారా ఈ క్షేత్రంలో ఉన్న వస్తువులన్నీ కర్తకు తెలుస్తాయి. యోగ పరిభాషలో ఈ క్షేత్రాన్ని "చిత్తము" అంటారు. ఇందులోనే మనస్సు, బుద్ధి, అహంకారం, అలాగే చిత్ (స్వయంగా చైతన్య కాంతి కూడా) ఉంటాయి. చిత్తములోని వస్తువులను మనం ఏ స్థాయి మేరకు గ్రహించగలమనేది,

ఏ స్థాయిలో సంస్కారాలు, వృత్తులు, అహము, ఇతర మాలిన్యాలతో ఆత్మ యొక్క ప్రకాశము కప్పబడి ఉందనే దానిపై ఆధారపడి ఉంటుంది.

చాలామంది అహాన్ని ఆత్మగా భావించి గందరగోళానికి గురవుతారు. "నేను ఎవరిని?" అనే ఒక ప్రసిద్ధమైన ప్రశ్న, సాధకునికి తాను శరీరాన్ని లేదా మనసును కాదనీ కేవలం ఆత్మను అని అర్థం చేసుకోవడానికి, వేయబడుతుంది. అయితే ఈ ప్రశ్నకు ఆధారం తప్పు. దీనికి ముగింపు ఏమిటంటే, "నేను ఆత్మను" అనే సమాధానం కూడా పొరపాటే. "నేను శరీరాన్ని" అని భావించడం ఎంత పొరబాటో అలాగే ఇది కూడా! ఎందుకంటే 'నేను' అనేది, శరీరం, మనసు, ఆత్మలలో దేన్ని ఉద్దేశించి చెప్పినప్పటికీ ఇక్కడ "నేను" అని భావించబడేది అహం మాత్రమే.

"నేను" అనే భావాన్నే అహం అంటాం. పతంజలి దీన్నే 'అస్మిత' – "నేను అనే భావన"గా సూచించారు. ఈ 'నేను' ను 'మిథ్య ఆత్మ' గా మనం అర్థం చేసుకొని తీరాలి. ఎందుకంటే ఇది ఎప్పుడూ అనుభవానికి సంబంధించిన విషయ వస్తువే కానీ, ఏనాటికీ అనుభవ కర్త కాదు. "నేను చేస్తున్నాను", "నేను అనుకుంటున్నాను", "నేను ఉన్నాను" అనే ఆలోచనలు మనకు కలిగినప్పటికీ, ఈ ఆలోచనలన్నీ ఆత్మ అనబడే ఆ నిజమైన కర్త, సాక్షీభూతంగా గమనించే విషయాలే. కనుక "నేనే ద్రష్టని" లేదా "నేను అనుభూతి చెందుతున్నాను" అనే భ్రమను కలిగించినప్పటికీ, స్వీయ భావనను ఒక విషయ వస్తువుగానే పరిగణించి తీరాలి.

ఇది అజ్ఞానం (అవిద్య) లేదా అవగాహనా రాహిత్యం వల్ల మనం ఈ "నేను" ని నిజమైన అనుభవానికి కర్తగా, ఆత్మగా పొరబడతాం. 'నేను' అనే భావనతో సహా, తెలియబడిన లేదా అనుభవించబడిన దేన్నైనా తప్పక జ్ఞాన వస్తువుగానే అర్థం చేసుకోవాలి; అంతేగాని కర్తగా కాదు. క్లుప్తంగా చెప్పాలంటే ఆత్మ మాత్రమే మన సారం. మన "నేను" అనే భావన కాదు!

చిత్తం అనేది అహంకారంతో నిండినప్పుడు, క్షేత్రంలోని ప్రతి ఇతర వస్తువూ 'నేను' కి సంబంధించినదిగానే కనిపిస్తుంది. గుర్తింపుకు అదే నిర్వచనం; అన్ని విషయాలను, అవి తన స్వీయగుర్తింపుతో ఎలా సంబంధం కలిగి ఉన్నాయో, అలాగే చూడడం. ఈ గుర్తింపును అధిగమించేందుకు నిరంతర స్మరణమే ఔషధం.

ఇది AEIOU[2] అభ్యాసానికి పర్యాయపదం. నిరంతర స్మరణను అమలుపరిచేందుకు మూడు ప్రాథమిక పద్ధతులు ఉన్నాయి:

1. భగవంతుని స్మరణలో పనులు చేయడం.
2. భగవంతునికి సమర్పణా భావంతో పనులు చేయడం.
3. భగవంతుని తరుఫున పనులు చేయడం.

ఈ పద్ధతులను సాధన చేయడం ద్వారా భగవంతుని అస్తిత్వం మన చైతన్య క్షేత్రంలో వ్యాపించడం ప్రారంభిస్తుంది. అలాగే మన చర్యలనూ, అనుభవాలనూ మన స్వీయ అస్తిత్వంతో గుర్తించడానికి బదులు, మనం వాటిని పరమాత్మతో లేదా గురువర్యులతో గుర్తించడం ప్రారంభిస్తాం. ఫలితంగా 'నేను' తో గుర్తింపు తన శక్తిని కోల్పోవడం ప్రారంభిస్తుంది.

'నేను' అనేదాన్ని కోల్పోవడం మనకి ద్రష్ట యొక్క దృష్టిని కల్గిస్తుందా? పతంజలి యోగ సూత్రం 1.3 ఇలా చెప్తుంది:

తదా ద్రష్టుః స్వరుపేవస్థానం
అప్పుడు (మనస్సు చలించడం ఆగినప్పుడు) ద్రష్ట,
తన స్వీయ ప్రకృతిలో నివసిస్తాడు.

ద్రష్ట యొక్క స్వభావం అజ్ఞానం అని అర్థం చేసుకోవడమే ఈ ప్రకటనకు కీలకం. తన స్వీయ స్వభావంలో నెలకొన్న ద్రష్ట, తన ఎరుకలోనూ ఉండడు (ఎందుకంటే కర్త, తనను తాను దర్శించలేడు కనుక); అలాగే 'నేను' అనే తప్పుడు గుర్తింపునీ — అది భగవంతుని స్మరణలో కరిగిపోయింది కనుక — చూడలేడు. బాబూజీ ఒకసారి యథాలాపంగానే అయినా ఎంతో లోతైన అర్థంతో, తాను 'నేను' అనే పదం పలికినప్పుడు 'అది ఎవరిని ఉద్దేశించో తనకు తెలియదు' అని అన్నారు. స్వీయ దర్శనం అనేది స్వీయ మైమరపు తప్ప మరేమీ కాదు — ఆ

[2] దాజీ వ్రాసిన 'యర్నింగ్ ఆఫ్ ద హార్ట్', 2వ సంపుటిలో AEIOU చాప్టర్ చూడండి

స్థితిలో ద్రష్ట పూర్తిగా తనను తాను కోల్పోతాడు. “నేను ఎవరు?” అని అడిగే పద్ధతికి బాబూజీ విముఖంగా ఉండేవారు. తనను తాను తెలుసుకునేందుకు ప్రయత్నించే బదులు, తనను తాను మరచిపొమ్మని ఆయన సూచించేవారు. అయితే అలా తనను తాను మరిచిపోయేందుకు ఒక కేంద్ర బిందువు అవసరం. అందుకే మనం ధ్యానాన్ని, నిరంతర స్మరణని సాధన చేస్తాం.

స్వీయ మైమరపులో ఉన్నప్పటికీ, ద్రష్ట ప్రాపంచిక విషయాలను, ఇతర జీవులను గమనిస్తూ ఉంటాడనే సంగతి తెలుసుకోవడం ఇక్కడ ముఖ్యం. స్వీయ గుర్తింపుకు చెందిన భావన అనేది కరిగిపోతుంది, అలాగే సంస్కారాలు లోతుగా, గాఢంగా ఏర్పడటం అనేది ఆగిపోతుంది.

తరచూ మనం గురుదర్శనం అంటే, ధ్యానంలో గురువర్యుల రూపాన్ని గమనించడం అని, అపార్థం చేసుకుంటాం. గురువు యొక్క నిజరూపాన్ని నిరాకారమైనదిగా మనం భావించేంతవరకు మాత్రమే, ఈ అభిప్రాయం సరియైనది. ఎలాగైతే స్వీయ దర్శనమనేదే స్వీయ మైమరపు స్థితో, కరిగిపోవడం లేదా శూన్యత వంటిదో, గురు దర్శనం కూడా ఆ నామ, గుణ రహితమైన నిరాకార అనంతత్వంలో పూర్తిగా కరిగిపోవడమే. ఈ లయావస్థలో లేదా గురువుతో ఐక్యమైన స్థితిలో ఇక ‘దర్శనం’ అనే ప్రశ్నే తలెత్తదు. ఎందుకంటే ఏకత్వంలో కర్త – వస్తు సంబంధం అనేది ఉండదు. దర్శనం యొక్క అంతిమస్థితి అలా ఉంటుంది.

ప్రేమతో మరియు గౌరవంతో,
కమలేష్

పూజ్య దాజీ 69వ జన్మదిన సందర్భంగా ఇచ్చిన సందేశం
సెప్టెంబర్ 28, 2024, కాన్హా శాంతి వనం

heartfulness
advancing in love